క్లుప్తంగా

చీటింగ్ కేసు నమోదు

గద్వాల క్రైం: పెద్దల సమక్షంలో కుదుర్చుకొని పెళ్లి నిరాకరించిన వరుడు, కుటుంబ సభ్యులపై శనివారం చీటింగ్ కేసు నమోదు చేసినట్లు పట్టణ రెండో ఎస్ఐ అబ్దుల్‌సుకూర్ తెలిపారు. పట్టణానికి చెందిన యువతికి ఆత్మకూర్‌కు చెందిన జె వినయ్(సాఫ్ట్‌వేర్) ఉద్యోగితో గతేడాది నవంబర్ నెల 9న పెద్దల సమక్షంలో అమ్మాయి ఇంట్లో నిశ్చితార్థం నిర్వహించారు. పెద్దల ఒప్పందంతో 2024 ఫిబ్రవరి 14న వివాహం నిర్వహించేందుకు తేదీని ఖరారు చేశారు. కట్న కానుకల కింద 15 తులాల బంగారం, రూ. 10 లక్షలు ఇచ్చేలా నిశ్చయం చేసుకున్నారు. అడ్వాన్స్‌గా రూ.30 వేలు, అరతులం బంగారం రింగు అందించారు. ఈ క్రమంలో పెళ్లి కుమారుడు, వారి తల్లిదండ్రులు వివాహం చేసుకోవడం లేదని, పెళ్లి కార్యక్రమాలు రద్దు చేసుకోవాలని ఒత్తిడి తీసుకొచ్చారు. ఈ విషయంపై పెద్దల సమక్షంలో పలు మార్లు పంచాయితీలు నిర్వహించినప్పటికీ పెళ్లి ఇష్టం లేదంటూ చెప్పడంతో యువతి తల్లిదండ్రులు న్యాయం కోసం పట్టణ పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించారు. వారి ఫిర్యాదు మేరకు వినయ్, వారి కుటుంబ సభ్యులు నర్సుబాయి, హీరాజీ, నారాయణ, శ్రీనివాసులు, వెంకటేష్, రాములపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఉపాధి పనులపై సోషల్ ఆడిట్



ధరూరు: మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో నిర్వహించిన పనులపై సోషల్ ఆడిట్ నిర్వహించారు. 2022 ఏప్రిల్ 1వ తేదీ నుంచి 31 మార్చి 2023 వరకు చేసిన రూ.7 కోట్ల పనులపై విచారణ కొనసాగుతోంది. గత నెల 24 నుంచి మండలంలో సోషల్ ఆడిట్ అధికారులు గ్రామాల్లో విచారణ నిర్వహించారు. మండలంలోని 28 గ్రామ పంచాయతీల్లో చేసిన పనులపై క్షేత్ర స్థాయి విచారణ అనంతరం శనివారం పబ్లిక్ హియరింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన పబ్లిక్ హియరింగ్ కార్యక్రమంలో పనుల్లో జరిగిన అవకతవకలపై శనివారం రాత్రి పొద్దుపోయే వరకు విచారణ కొనసాగింది. రూ.7 కోట్ల పనుల్లో ఎంత మేర అవినీతి జరిగిందనే దానిపై సోషల్ ఆడిట్ అధికారులు వివరాలు చదివి వినిపిస్తున్నారు. అన్ని గ్రామ పంచాయతీలు పూర్తయ్యాక పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఎస్ఆర్‌పీ కాశన్న తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎండీ జబ్బార్, ఏపీఓ సుజాత ఉన్నారు.

బహుమతుల అందజేత

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన ప్రతిష్టాన్, తెలంగాణ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయ వేదిక ఆధ్వర్యంలో విద్యార్థులకు సోషల్ టాలెంట్ టెస్టు నిర్వహించారు. ఈ టెస్టులో ప్రతిభ చాటిన విద్యార్థులకు శనివారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఇమ్మానియేల్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నడిగడ్డ తెలంగాణ సోషల్ ఫోరం అధ్యక్షుడు పాల్వాయి లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి ప్రతాప్, ఉపాధ్యాయులు శీలన్న, రేణుకాదేవి, నారాయణరావ్ ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

అలంపూర రూరల్: మండలంలోని ర్యాలంపాడ్ శివారులో శనివారం అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్ఐ ఏ నాగరాజు తెలిపారు. కాశీం, శివలు అక్రమంగా ర్యాలంపాడ్ పాఠశాల, కెనాల్ దగ్గర రెండు ట్రాక్టర్లపై ఇసుకను తరలిస్తుండగా కానిస్టేబుల్ పరశురాముడు, ఆంజనేయులు, యుగంధర్‌లు గస్తీ నిర్వహిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మాజీ సర్పంచ్‌కు సన్మానం

మానవపాడు: మండలంలోని మద్దూరులో శనివారం మాజీ సర్పంచ్ లక్ష్మీదేవికి గ్రామ ప్రజలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు గ్రామానికి చేసిన సేవలపై మాట్లాడారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, కృష్ణ, లక్ష్మీనారాయణ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కేటీదొడ్డి ఎస్ఐకి..

కేటీదొడ్డి: నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ శ్రీనివాస్‌రావును, బదిలీపై వెళ్తున్న ఎస్ఐ వెంకటేష్‌ను శనివారం మండల బీఆర్ఎస్ నాయకులు పూలమాల శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఉరుకుందు, వాల్మీకి మండల అధ్యక్షుడు టీచర్ గోవిందు, నాయకులు ఉన్నారు.

కాల్వలు శుభ్రం చేయాలి

శాంతినగర్: మురికి కాల్వలు ఎప్పటికప్పుడు శుభ్రం చేసి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని పారిశుద్ధ్య సిబ్బందిని కొంకల ప్రత్యేకాధికారి రవీంద్ర ఆదేశించారు. వడ్డేపల్లి మండలంలోని కొంకల గ్రామ పంచాయతీ సిబ్బంది, మల్టీపర్పస్ వర్కర్లు, ఫీల్డ్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శితో ప్రత్యేకాధికారి శనివారం సమావేశం ఏర్పాటు చేశారు.

6న సర్వసభ్య సమావేశం

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈ నెల 6న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు మండల ప్రజా పరిషత్ అధికారి రాఘవ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు ఈ సమావేశానికి హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

హరితహారానికి సిద్ధం

- పండ్లు, పూలు, ఔషధ మొక్కలు ప్రత్యేకం
- ఖాళీ సంచుల్లో మట్టి నింపుతున్న కూలీలు
- 16 గ్రామాల నర్సరీల్లో మొక్కల పెంపకం



మానవపాడులోని నర్సరీలో హరితహారం మొక్కలు

మానవపాడు: తొమ్మిదో విడత హరితహారంలో భాగంగా మండలాన్ని ఆకుపచ్చగా తీర్చిదిద్దేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేస్తున్నారు. ఈ ఏడాది మండలంలోని 16 గ్రామ పంచాయతీ పరిధిలో ఒక్కో గ్రామ పంచాయతీ నుంచి 10వేల మొక్కలను పెంచాలని నర్సరీల్లో మొక్కలను పెంచుతున్నారు. దాదాపు మండలంలో 16వేల మొక్కల పెంపకానికి గ్రామ పంచాయతీల్లో మొక్కలను పెంచుతున్నారు. మొక్కల పెంపకానికి అనుగుణంగా వర్షాలు కురవగానే ఆయా గ్రామాల్లోని నర్సరీల్లో ఎదిగిన మొక్కలను రహదారులకు ఇరువైపులా, పంటపొలాలు, ఖాళీ స్థలాల్లో నాటనున్నారు. గతంలో హరితహారంలో నాటిన మొక్కల పట్ల సరైన సంరక్షణ లేకపోవడం, వర్షాలు సరిగా కురవకపోవడంతో తదితర కారణాలతో ఆశించిన స్థాయిలో మొక్కలు ఎదిగేవి కావు. ఈ ఏడాది పెద్ద మొత్తంలో మొక్కలు నాటేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఇందులో భాగంగా మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో నర్సరీలను ఏర్పాటు చేసి ఖాళీ బ్యాగుల్లో మట్టిని నింపుతున్నారు. బ్యాగుల్లో మట్టిని నింపిన అనంతరం 18 రకాల మొక్కలను పెంచి జూన్‌లో వర్షాలు కురవగానే మొక్కలను నాటేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకుంటున్నారు.

పండ్లు, పూల మొక్కలకు ప్రాధాన్యం..

మండల వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో నర్సరీలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఆయా గ్రామ పంచాయతీల్లో ఖాళీ సంచుల్లో మట్టి నింపే ప్రక్రియ కొనసాగుతోంది. ముఖ్యంగా నర్సరీల్లో గుల్‌మోహర్, రెయిన్ ట్రీ, సీతాఫలం, మునగ, కానుగ, జామ, ఉసిరి, బొప్పాయి, బహునియ, ఈత, సీమతం, గేదు, దానిమ్మ, నిమ్మ, కర్రీ లీఫ్, చామంతి, మల్లె, గులాబీ, మందారం, తదితర మొక్కలను పెంచేందుకు అధికారులు సిద్ధమయ్యారు.

కృష్ణ తులసీ ప్రత్యేకం..

హరితహారంలో భాగంగా ఆయా గ్రామ పంచాయతీల్లో భాగంగా ఇంటింటికి 'కృష్ణ తులసీ' మొక్కలను పంపిణీ చేసేందుకు అధికారులు సిద్ధం అవుతున్నారు. అనేక ఔషధ గుణాలు కలిగిన మొక్కలను నర్సరీల్లో పెంచుతున్నారు. ఈ మొక్క నుంచి వాసనతో ఇంట్లో నాటడం ద్వారా దోమల నివారణ సాధ్యం అవుతుందని అధికారులు చెబుతున్నారు.

మొక్కలను సంరక్షించుకుందాం



ఎన్నో లక్షల రూపాయల వ్యయంతో ప్రభుత్వం మొక్కలను పెంచుతోంది. కానీ వాటికి సరైన నిర్వహణ లేకపోవడంతో కొన్ని రోజుల త ర్వాత చనిపోతున్నాయి. దీని వల్ల ప్రభుత్వ ల క్ష్యం నీరుగారుతోంది. నాటిన ప్రతి మొక్కను సంరక్షించుకోవాలి. మండలంలోని ఆయా గ్రామాల్లో నాటిన ప్రతి మొక్కను బాధ్యతగా కాపాడాలి.

– మద్దిలేటి, చెన్నిపాడు

వర్షాలు కురవగానే మొక్కలు నాటుతాం



ప్రభుత్వం ప్రతి ఏడాది హరితహారంలో భాగంగా గ్రామాల్లో హరితహారం చేపడుతోంది. జూన్‌లో చేపట్టే హరితహార కార్యక్రమానికి సిద్ధం చేస్తున్నారు. వర్షాలు కురిసే వరకు నర్సరీల్లో మొక్కలు పెంచి వర్షాలు కురవగానే ఆయా గ్రామాల్లోని నర్సరీల్లో ఉన్న మొక్కలను నాటుతాం.

– రమణారావు, ఎంపీడీఓ మానవపాడు

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి



ఎర్రవల్లిలో కంది కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏడీఏ సక్రీయ నాయక్

ఎర్రవల్లిచౌరస్తా: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగించుకోవాలని ఏడీఏ సక్రియనాయక్ అన్నారు. శనివారం ఎర్రవల్లి మండల కేంద్రంలోని పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంది కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించి రైతులతో మాట్లాడారు. రైతులు పండించిన పంటలను కొనుగోలు కేంద్రాల ద్వారానే విక్రయించాలన్నారు. అనవసరంగా దళారులను నమ్మి పంటను తక్కువ ధరలకు విక్రయించి రైతులు మోసపోవద్దని సూచించారు. రైతులు స్థానిక వ్యవసాయ అధికారితో ధ్రువీకరణ పత్రం తీసుకొని సరైన తేమ వచ్చే వరకు కంది పంటను ఎండబెట్టుకొని కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని సూచించారు. అనంతరం ఎర్రవల్లి కూడలిలోని పలు విత్తన, పురుగు మందుల దుకాణాలను సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. కేవలం ప్రభుత్వ నిబంధనల మేరకు మాత్రమే రైతులకు ఒరిజినల్ రశీదులతో మందులు విక్రయించాలని సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధికారులు, సిబ్బంది, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి



సూచనలిస్తున్న సీఐ శివశంకర్‌గౌడ్



ధరూరు వైఎస్సార్ చౌరస్తాలో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్ఐ శివానందంగౌడ్

శాంతినగర్: ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలని సీఐ శివశంకర్‌గౌడ్ వాహనదారులకు సూచించారు. వడ్డేపల్లి పుర పరిధిలోని అలంపూర్–రాయచూర్ ప్రధాన రహదారిపై వాహనదారులను నిలిపి రోడ్డు భద్రత నియమాలు పాటిస్తున్న వారికి పుష్పాలు అందజేసి ధన్యవాదాలు తెలిపారు. సీఐ వెంట ఎస్ఐ నరేష్, హెడ్‌కానిస్టేబుల్ వెంకటస్వామిగౌడ్, కానిస్టేబుల్ ప్రకాషం, డ్రైవర్ మనోహర్‌లు పాల్గొన్నారు.

అయిజ: రోడ్డుపై ప్రయాణించే వారందరు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ నరేష్‌కుమార్ హెచ్చరించారు. మండల కేంద్రంలో అయ్యప్పస్వామి ఆలయం ముందు గద్వాల రోడ్డుపై పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. నిబంధనలు పాటించని వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు.

రాజోళి: ద్విచక్రవాహనం నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్, కారు నడిపే ప్రతి ఒక్కరు సీట్ బెల్టు ధరించాలని ఎస్ఐ జగదీష్ అన్నారు. సుంకేసుల డ్యాం సమీపంలో రోడ్డు భద్రతపై వాహనదారులకు అవగాహన కల్పించారు.

ధరూరు: ద్విచక్ర వాహనాలు నడిపే వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ శివానందంగౌడ్ అన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమంలో భాగంగా ధరూరులోని వైఎస్సార్ చౌరస్తాలో ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీసులు ఏఎస్ఐ వెంకట్రాములు, పోలీసులు, వినోద్ కుమార్, కరుణాకర్, జగన్‌మోహన్ పాల్గొన్నారు.

ప్రతి పల్లెకు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు



మాట్లాడుతున్న బలిగెర శివారెడ్డి

గద్వాల రూరల్: కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ రకాల సంక్షేమ అభివృద్ధి పథకాలను ప్రతిపల్లెకు తీసుకెళ్లేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ సీనియర్ నాయకులు బలిగెర శివారెడ్డి అన్నారు. డీకే బంగ్లాలో పట్టణ అధ్యక్షుడు బండల వెంకట్రాములు ఆధ్వర్యంలో గావ్‌చలో అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని 700గ్రామాల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ త్యాగరాజు, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు దాస్, సీనియర్ నాయకులు రజక నర్సింహులు పాల్గొన్నారు.

కేటీదొడ్డి: కేంద్ర ప్రభుత్వం అమలు చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని బీజేపీ జిల్లా సీనియర్ నాయకులు బల్గెర శివారెడ్డి అన్నారు. ప్రతి గ్రామంలో ఇంటింటికి వెళ్లి కేంద్రం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

అయిజ: దేశంలో బీజేపీ వల్లనే అభివృద్ధి సాధ్యమవుతుందని, బీజేపీని బలోపేతం చేద్దామని అలంపూర్ నియోజకవర్గం అసెంబ్లీ కన్వీనర్ మెడికల్ తిరుమలరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు నరసింహయ్య శెట్టి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ ఉపాధ్యక్షుడు లక్ష్మణ్ గౌడ్, ప్రధాన కార్యదర్శి భగత్‌రెడ్డి, రఘు పాల్గొన్నారు.

లక్ష్యసాధన దిశగా అడుగులు వేయాలి

గట్టు: విద్యార్థి దశలో పదో తరగతి కీలకమని, ప్రతి విద్యార్థి పది నుంచే లక్ష్యాలను ఏర్పచుకుని, దాన్ని సాధించే దిశగా అడుగులు వేయాలని ఎంపీపీ విజయ్‌కుమార్ కోరారు. శనివారం ఆరగిద్ద ఉన్నత పాఠశాలలో ఎంపీపీ విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో ముఖాముఖి కార్యమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణతను సాధించాలని. ఆ దిశగా ఉపాధ్యాయులు, విద్యార్థులు కృషి చేయాలన్నారు. తన బాధ్యతగా విద్యార్థులకు పరీక్ష కిట్లను అందజేస్తున్నట్లు తెలిపారు. పదో తరగతిలో 10జీపీఏ సాధించిన విద్యార్థులందరికి రూ. 5,016 లను అందజేయనున్నట్లు ఎంపీపీ తెలిపారు. విద్యార్థులు వార్షిక పరీక్షలకు సిద్ధయ్యేందుకు వీలుగా పరీక్షాపత్రాల కిట్లను ఎంపీపీ అందజేశారు. కార్యక్రమంలో హెడ్మాస్టర్ జహీర్‌బేగ్, ఎస్ఎంసీ మాజీ చైర్మన్ కుమ్మరి నర్సింహులు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు అంగడి బస్వరాజు, ఉపాధ్యాయుడు విక్రమసింహాచారి పాల్గొన్నారు.



విద్యార్థులతో ఎంపీపీ విజయ్‌కుమార్

కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్



గద్వాల రూరల్: ప్రతికార్యకర్తకు అండగా బీఆర్ఎస్ పార్టీ ఉంటుందని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. గద్వాల పట్టణంలోని 5వ వార్డులో బీఆర్ఎస్ పార్టీకి చెందిన కుర్వ ఆంజనేయులు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ప్రమాద బీమా కింద బాధిత కుటుంబానికి రూ.2లక్షల చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్, సతీష్, ప్రవీణ్, రాముడు, శ్రీరాములు ఉన్నారు.

జీఓ 19ను రద్దు చేయాలి

గద్వాల అర్బన్: దళిత హక్కులను కాలరాసే విధంగా ఉన్న జీఓ 19ను తక్షణమే రద్దు చేయాలని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు మాచర్ల ప్రకాష్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవో భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని 255 గ్రామాల్లోని ప్రజలకు అంబేద్కర్ జ్ఞాన సభల ద్వారా ఆయన చేసిన సేవలను ప్రచారం చేయాలని, ఘనంగా అంబేద్కర్ ఉత్సవాలను నిర్వహించాలన్నారు. అంతకు ముందు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు మహేష్, కృష్ణరాజు, దేవదాస్, సుందర్ రాజు, మహదేవ్ ఉన్నారు.

ప్రయోగ పరీక్షల పరిశీలన



అయిజ: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరానికి సంబంధించిన పబ్లిక్ ప్రయోగ పరీక్షా కేంద్రాలను జిల్లా అధికారులు శనివారం పరిశీలించారు. మండల కేంద్రంలోని జూనియర్ కళాశాల, సాయితేజ, ఒకేషనల్ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ప్రయోగ పరీక్షల నిర్వహణను జిల్లా ఇటర్మీడియట్ నోడల్ అధికారి హృదయరాజు, జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు రమేష్ లింగంతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రయోగాలకు సంబంధించిన ప్రశ్నలను విద్యార్థులను అడిగి సమాధానాలు రాబట్టారు.

ప్రభుత్వం దృష్టికి మున్సిపల్ ఉద్యోగుల సమస్యలు

గద్వాలన్యూటౌన్: మున్సిపల్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను యూనియన్ తరఫున ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు నాగార్జున్‌గౌడ్ అన్నారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో టీఎన్‌జీఓ మున్సిపల్ విభాగం జిల్లా కమిటీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో టీఎన్‌జీఓ మున్సిపల్ విభాగం జిల్లా అధ్యక్షుడు రాజేష్ కుమార్, సెక్రటరీ సలాం, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ఎల్లారెడ్డి, ఆర్ఓ రాములు, సభ్యులు పాల్గొన్నారు.

నీటి సమస్యను పరిష్కరించాలి

అలంపూర్: మున్సిపాలిటీలో తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని మున్సిపల్ కౌన్సిలర్ ఇంతియాజ్ అలీ డిమాండ్ చేశారు. అలంపూర్ మున్సిపాలిటీలోని బీఆర్ఎస్ ఫంక్షన్‌హాల్ వద్ద చేపడుతున్నట్లు పనులను మున్సిపల్ కౌన్సిలర్ శనివారం పరిశీలించారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా 3, 4 వార్డుల్లో తాగునీరు సరఫరా కావడం లేదన్నారు. బీఆర్ఎస్ ఫంక్షన్ హాల్ నందు లీకేజీలు ఉండటంతో నీటి సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడుతోందన్నారు. భగీరథ పైప్‌లైన్‌కు వాల్వ్ ఏర్పాటు చేసి శాశ్వత పరిష్కారం చూపాలన్నారు.

క్రీడలు సామాజిక స్ఫూర్తిని పెంచుతాయి

- జెడ్పీ చైర్ పర్సన్ సరిత



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ సరిత

అయిజ: క్రీడలు మానసిక, శారీరక ఉల్లాసం కలిగించడమే కాకుండా సామాజిక స్ఫూర్తిని పెంచుతాయని జెడ్పీ చైర్‌పర్సన్ సరిత అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలోని తిక్క వీరేశ్వరస్వామి ఆలయం పరిసర ప్రాంతంలో తిక్కవీరేశ్వర ప్రీమియర్ లీగ్ జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలల విద్యార్థులు విన్యాసాలు చేసి ఆకట్టుకున్నారు. అనంతరం జెడ్పీ చైర్‌పర్సన్ సరిత మాట్లాడారు. సాంకేతిక పరిజ్ఞానం కొత్తపుంతలు తొక్కుతున్న నేటి కాలంలో కూడా క్రీడలకు పాముఖ్యతనిచ్చి క్రికెట్ టోర్నమెంట్‌ను ఏర్పాటు చేయడం హర్షించదగ్గవిషయమన్నారు. క్రీడల్లో వివిధ కులాలు, మతాలు, వర్గాలకు చెందినవారు పాల్గొంటారని, క్రీడల్లో పాల్గొన్నంతసేపు అంత సమానమే భావనతో ఉంటారని, అది సామాజిక స్ఫూర్తిని ఇస్తుందన్నారు. జిల్లాలో ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఉన్నా గత ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహించకపోవడంతో క్రీడాకారులు ప్రతిభ కనబరచడంలో వెనుకబడ్డారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో క్రీడారంగానికి పెద్దపీట వేస్తామని, క్రీడాకారులను ప్రోత్సహిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మురారి సోమశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు దీపక్ ప్రజ్ఞ, సీతారామిరెడ్డి,శేక్షావలి ఆచారి, మద్దిలేటి, రాణెమ్మ, క్రీడాకారులు పాల్గొన్నారు.

సురక్షిత వాతావరణంలో బాలలు పెరగాలి



క్యాతూర్‌లో మాట్లాడుతున్న ఎస్ఐ నాగరాజు



సాతర్లలో అవగాహన కల్పిస్తున్న శివ

అలంపూర్ రూరల్: బాల్యం పిల్లల హక్కు అని వారందరూ స్వేచ్ఛ వాతావరణంలో పెరగాలని వక్తలు అన్నారు. మండలంలోని క్యాతూరు జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో శనివారం మహిళా శిశు సంక్షేమశాఖ బాలల సంరక్షణ విభాగం ఆధ్వర్యంలో బాలల సంరక్షణపై అవగహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా బాలల సంరక్షణ అధికారి బీ నర్సింహ మాట్లాడుతూ చిన్నతనం నుంచి లక్ష్యం పెట్టుకుని చదవాలని సూచించారు. 2012లో లైంగిక వేధింపుల రక్షణ కల్పించేందుకు లైంగిక వేధింపుల చట్టం రూపొందించారని తెలిపారు. ఎస్ఐ నాగరాజు మాట్లాడుతూ చిన్నతనంలోనే పెళ్లిలు చేయడం చట్ట రిత్యా నేరమన్నారు. బాల్య వివాహం చేస్తున్నట్లు తెలిస్తే గ్రామంలో ఉండే బాలల పరిరక్షణ కమిటీకి లేదా డయల్ 100, 1098కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయమ్మ ఆధ్వర్యంలో బేటీ బచావో బేటీ పడావో పై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో భరోసా కో ఆర్డినేటర్ శివవాణి, సామాజిక కార్యకర్త పద్మ, పాఠశాల హెచ్ఎం మాధవి, చైల్డ్‌లైన్ సూపర్‌వైజర్ నవీణ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని సాతర్లలో మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బాలల సంరక్షణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి జిల్లా బాలల సంరక్షణ లీగల్ అధికారి శివ హాజరై బాలల చట్టాలపై ఉపాధ్యాయులకు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. బాలలకు ఎదురయ్యే వివిధ సమస్యలు, బడిబయటి పిల్లలు, బాల్య వివాహాల వల్లే కలిగే అనార్థాలు, బాల కార్మిక వ్యవస్థతో పాటు బాలల చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో ఎక్కడైనా అనాథ పిల్లలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్‌లైన్ సభ్యురాలు లక్ష్మి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీప్రసాద్, ఉపాధ్యాయులు రాములు, కుమార్‌చారి, విద్యార్థులు ఉన్నారు.

ప్రజల సమస్యలను పరిష్కారం చేయండి



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన ప్రత్యేక అధికారులు

మానవపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లో విధుల్లో చేరిన ప్రత్యేక అధికారులు గ్రామాల్లో సమస్యలు లేకుండా పరిష్కారం చేయాలని ఎంపీడీఓ రమణారావు తెలిపారు. శనివారం మంత్రి సీతక్క ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాల్లో తాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్యం, ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. 15వ ఆర్థిక సంఘం నుంచి నిధులను ఉపయోగించుకోవాలన్నారు. మంత్రి ఆదేశానుసారం గ్రామాల్లో పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమ్మెను విజయవంతం చేయండి



వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న నాయకులు

అయిజ: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 16న నిర్వహించనున్న దేశవ్యాప్త ఒకరోజు సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వీవీ నరసింహ పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో హమాలీ సంఘం కార్యాలయంలో సమ్మెకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. దేశంలో రెండోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ సర్కార్ వ్యవసాయ కూలీలు, కార్మికవర్గ సమస్యలపై దృష్టిపెట్టకుండా పెట్టుబడుదారులకు, భూస్వాములకు దేశ సంపదను దోచిపెట్టేందుకు పరిపాలన సాగిస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి ఈశ్వర్, కమిటి సభ్యులు శంకర్ గౌడ్, ఏసేపు, రాముడు, మౌలాలి, మహేందర్, ఆంజనేయులు, రాజు, గోవిందు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలి



విద్యార్థుల తల్లిదండ్రులకు నగదు అందజేస్తున్న ట్రస్టు నిర్వాహకులు

మల్దకల్: విద్యార్థుల క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యంతో ముందుకెళ్లాలని వెంకటేశ్వర్‌రెడ్డి, వెంకటేశ్వరమ్మ ట్రస్టు నిర్వాహకులు సాగర్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డిలు విద్యార్థులకు సూచించారు. శనివారం అమరవాయి జెడ్పీహెచ్ఎస్‌లో 10వ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను ట్రస్టు నిర్వాహకులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదువుకొని పాఠశాలకు, గ్రామానికి మంచి గుర్తింపు తీసుకురావాలన్నారు. మండల స్థాయిలో ఎల్కూరు హైస్కూల్‌కు చెందిన ఆదికేశవరెడ్డి, బిజ్వారం, అమరవాయి పాఠశాలకు చెందిన ఉరుకుందు, జయశాలి, నందినిలకు నగదు బహుమతి అందజేశారు. మొత్తం విద్యార్థులతో పాటు పాఠశాల అభివృద్ధికి రూ. 50వేలకు పైగా పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ విజయలక్ష్మి, పద్మ మ్మ, హెచ్ఎం నరేష్, ఉపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, జానకమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కులను కాలరాస్తున్న బీజేపీ

గద్వాల అర్బన్: కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను బీజేపీ ప్రభుత్వం కాలరాస్తోందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింహ అన్నారు. ఈనెల16న జరగబోయే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు మద్దతుగా శనివారం గద్వాల మండలంలోని కొత్తపల్లి, వీరాపురం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. కార్మికులు, ప్రజలు సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. వెంకటన్న, పాపన్న, వెంకటేష్, రామకృష్ణ ఉన్నారు.